


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

111

(10 ' జనవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**వెనుక** బందరు పట్టణంలో ఇద్దరు పిచ్చివాళ్ళుండేవారు. ఎవరికి వారు ఎక్కడ పడితే అక్కడ అంతులేని అల్లరి చేస్తూ తిరుగుతూ ఉండేవారు. ఒక్కొక్కప్పుడు విచిత్రంగా ఇద్దరూ కలుస్తూ ఉండేవారు. అప్పుడు ఆ ఇద్దరి మధ్యా చాలా తమాషా సంభాషణ జరుగుతూ ఉండేది.

ఉదాహరణకు ఒకటి చెపుతాను. వారిద్దరూ ఒకరోజు సాయంత్రంపూట కాఫీ హోటల్ వద్ద కలుసుకున్నారు. ఒకాయన బయటినుంచి ఇలా అరిచాడు -

"ఒరేయ్ పిచ్చి సన్యాసి నువ్వు బయటికిరా అక్కడ కూర్చున్నావేం? ఈ హోటల్ నాది. రా నీకీ మాత్రం తెలియదు. త్వరగా రా బయటికి. నే లోపలికి వెళ్ళాలి" అని.

లోపల వున్న ఆయన "నన్ను పిచ్చివాడంటున్నావా? నీది అసలు పిచ్చి. నాకేం పిచ్చిరా. నవ్వుతూ నాలుగు గారెలు తిన్నాను. పెసరట్టుకు ఆర్డరిచ్చి అక్బరు చక్రవర్తిలాగా కూర్చున్నాను" అన్నాడు.

"ఆరి దుర్మార్గుడా హోటల్ నాది అంటే వినవేం. నువ్వు అక్బరువైతే నేను అశోకుణ్ణి. నీ ఆటలు నా దగ్గర సాగవు. త్వరగా బైటికిరా. నాకు ఆకలవుతోంది" అని రెండో ఆయన ఆజ్ఞ

ఇద్దరూ చదువుకున్నవాళ్ళు. ఒకరు పండితుడు. ఒకాయన నటుడూ అవడంవల్ల చమత్కారంగా మాట్లాడుతూ ఉండేవారు. మధ్య మధ్య పద్యాలు చదువుతూ ఉండేవారు.

"నా హోటల్! నా హోటల్" అని ఒకాయన అంటుంటే చివరకు రెండో ఆయన అన్నారు "హోటల్ నీదేమిట్రా? అసలీ ఊరు నాది. నవాబుగారు నాకు వ్రాసి ఇచ్చాడు. కావాలంటే మా యింటికిరా పట్టా చూపిస్తాను."

"నీ పట్టా ఎవడిక్కావాలిరా. అక్కడ నుంచి కదలకపోయావంటే జుట్టు పట్టుకుని ఈడ్చుకువస్తాను. కాసేపట్లో జరగబోతోంది పిచ్చయ్య మానభంగం జాగ్రత్త" అని రెండో ఆయన హుంకరించాడు.

అక్కడితో లోపల పెసరట్టు తింటున్న వెర్రివాడు, దాన్ని దూరంగా త్రోసివేసి, లేచి నిలబడి ఉత్తరీయం గట్టిగా పొట్టకు అదుముకుని

"హే కృష్ణా మొరాలింపవా
యదుకుల కృష్ణ మొరాలింపవా
పాపాత్ముడు, దుష్టాత్ముడు
పరాభవింప వచ్చె

నీదు సోదరిని గానా

నీ అభయము వినలేనా కృష్ణా."

అని చక్కటి సంగీతంతో పాడి హోటల్లో ఫలహారాలు చేసేవారినందర్నీ పరవశుల్ని చేశాడు. ఆ సమయంలో వాకిట్లో వున్న 'వెర్రి' పరుగెత్తుకువచ్చి "ఎంత బాగా పాడావురా గొప్ప నటుడివి కావున్రా. నీకు కప్పు బహుమతి ఇస్తున్నానురా" అని అక్కడ ఎవరో కాఫీ త్రాగి వదిలిపెట్టిన పింగాణీకప్పు చేతికిచ్చి అందర్నీ చప్పట్లు కొట్టమని, తనాగాయకుణ్ణి ఆలింగనం చేసుకున్నాడు.

ఈనాడు కాంగ్రెసులో బయలుదేరిన వర్గాల్ని తలచుకుంటే పై వృత్తాంతం జ్ఞాపకం వచ్చింది. పైన చెప్పిన వాళ్ళిద్దరూ చివరకు ఆలింగనాల్లో కరిగిపోయినట్లు వీరు కరిగిపోతారో లేదో తెలియదుగానీ, వాళ్ళిద్దరూ ఒకరినొకరు నిందించుకున్నట్లుగానే ఉభయ పక్షాలు నిందించుకోవడం జరుగుతోంది.

ఒకరు హోటల్ నాదంటే, ఒకరు ఊరు నాది అన్నట్లుగానే వీరూ 'దేశం మాది' అంటూ ప్రకటనలు చెయ్యడం జరుగుతోంది.

ఆకాశం మీద చందమామలు రెండు ఉండటం, ఇద్దరు సూర్యులుండటం ఎంత అసంభవమో, ఐచ్ఛికమైన కాంగ్రెసు సంస్థలు రెండు ఉండటం కూడా అంత అసంభవం అనే భావం ఏ ఒక్కరికీ కలగకపోవడం ఆశ్చర్యకరం.

ప్రతిష్ఠ కాపాడుకోదలచినవారికి ధర్మాన్ని బేరీజు వేసుకోవడం రివాజు. ఆ దృక్పథం లేని వారందరినీ వట్టి పోజుల క్రిందే జమకడతాయనేది తేలిగ్గా అర్థమయ్యే సత్యం. కలహాలలో కక్షల్లో మునిగి తేలేవారు అంటే పరిశీలనకు దిగకపోయినా ప్రజానీకం ఎక్కడికి పోతుంది? వంచనా శిల్పాన్ని వారెంతమాత్రం సహించరు.

దేశాన్ని మేము కాపాడుతాం, మేం రక్షిస్తామని ఉభయులు ఉత్తరకుమారుడు ప్రజ్ఞలు కొడుతుంటే ఇరుపక్షాల వారిమీదా నమ్మకంలేక ప్రజలు నభోలోకం వంక చూడటం జరుగుతుంది. జరుగుతోంది.

అహ్మదాబాదులో తాము జరిపితే బొంబాయిలో వీరు జరిపారు. ఇరుపక్షాలవారికీ 'మా సభ విజయవంతమైంది' అనే ఆశాభావం ఏర్పడింది. ఇరువురికీ ప్రేక్షకులు కరువులేరు. ఇరువురూ "మా సభలకే ఎక్కువమంది హాజరయ్యారు" అన్నారు. ఎలా హాజరయ్యారు? ఎందుకు హాజరయ్యారు? ఎలాంటి అనుభూతి సంపాదించారు? అనే ప్రశ్నలకు తావులేదు. హాజరయారు. అమితంగా హాజరయారు.

భారతదేశం చాలా పెద్దది. ఇలాటి సభలు పదహారు ఒకే నెలలో జరిగినా, దేశంలో తలోమూలా జరిగినా, ఆఖరుకి అండమానుల్లో జరిగినా, ఇంతమందీ హాజరయే అవకాశముంది. ఎలాంటి సభలనైనా దిగ్విజయం చెయ్యగల ప్రజానీకం మనకు ఉంది. అదే అందరి ధీమా.

సభలు జరిపిన తర్వాత సందేశాలివ్వడం, తీర్మానాలు చెయ్యడం అవసరం. ఈసారి సభల్లో తీర్మానాలతోపాటు, తిట్టిపొయ్యడాలు కూడా ఒక ముఖ్యాంశంగా పరిణమించింది. అదీకాక ఒకరు అవునన్నది కాదనడం, కాదన్నది అవుననడం ఒక ప్రత్యేక ఘట్టంగా తయారైంది.

"మమ్మల్నే నమ్మండి. ఇతరుల్ని చూసి మోసపోకండి. మా సేవ మంచిది. మహత్తరమైంది. భారతదేశ భవిష్యత్తు మా చేతుల్లోవుంది. మా మందు వాడి చూడండి. ధర సరసం. ఫల విశ్వాసం ప్రకటించిన వి.పి చార్జీలు ఉచితం."

అంటూ మందుల ప్రకటనలవంటి హామీలు ఉభయ పీటాలనుంచీ వెలువడటం ఒక విచిత్ర పర్వం.

ఎవరికి వారు కొంత బలాన్ని సమకూర్చుకుని సగర్వంగా వ్యవహరిస్తూ తమరే అసలైన సంస్థ అని ప్రకటించుకుంటూ, పదవీ వ్యామోహాలోపడి, పసిడి శంఖాలూదుకుంటున్న సమయంలో అందులో వారిని కొందర్ని తీసివేశామని వీరూ, ఇందులోవారిని కొందర్ని తీసివేశామని వారూ ప్రకటించుకోవడం అర్థరహితర, హాస్యాస్పద ప్రలాపాలుగా ఉన్నాయిగానీ, మరో ప్రయోజనమేమీ సాధించడం లేదు.

దేశంలో వ్యాపారాలన్నిటినీ జాతీయం చేస్తామని అధికార ప్రభుత్వ ప్రకటన ముందు సంస్థానాధిపతుల భరణాలు తొలగించాలని ప్రతిపక్ష కాంగ్రెసు ప్రకటన అన్నిటినీ జాతీయం చేస్తాం, అభ్యుదయం సాధిస్తాం అని ఇండికేటుల పాలికేకలు, మనలో మాట మనస్సుల్నే జాతీయం చేసుకోలేని వాళ్ళు ఇతర వ్యాపారాల్ని, పరిశ్రమల్ని చేసి సాధించే ప్రగతి ఏమిటి చెప్పండి. ఎనభై ఏళ్ళకు పైగా జాతీయ సంస్థగా రూపొందిన కాంగ్రెసు మహా సంస్థలో గణనకెక్కిన మహనీయులు, వేటినో జాతీయం చేస్తామంటే వేడుక మాటలుగా ఉండవు మరి.

కాంగ్రెసు రెండుగా చీలినందువల్ల వచ్చిన లాభనష్టాలను గురించి కొంతవరకు వివరించవచ్చు. ఒకటి పత్రికలకు కావలసినంత ముడిపదార్థం. రెండు ప్రజల నిస్పృహకు అంతులేని అవకాశం. మూడు ఊరూరా ఉత్తర కుమారప్రజ్ఞులు. నాలుగు ప్రతిపక్షుల నాల్కలకు పదును, అయిదు అవినీతి వగైరా నుంచి అదును. అనైక్యతకు చక్కటి ఆలంబన.

రెండు మహాసభలవల్ల అంతులేని ధననష్టం. ఆ డబ్బుతో ఇరవైలక్షల ఎకరాలకు మంచి ఎరువు చల్లవచ్చు. అక్కడ స్వీట్లు తిన్నారట. పాలు త్రాగారట. ప్రజలపాట్లేం తప్పలేదు. వారి పాల దారిద్ర్యమే మిగిలింది. ఎందుకొచ్చిన ఖర్చులు చెప్పండి. ఒక్కచోటే వరుసగా రెండు సభలూ జరిపినా కొంత ఖర్చు తగ్గేది. కొంత సరసం మొగ్గేది. ఇవన్నీ ఆలోచించడానికి అవకాశమేది?

వెనుక మా ఊరిదగ్గర కాలువలో పడవలకు పోటీ వచ్చింది. ఒక పడవ ఆసామి అరటిపళ్ళు పెడితే, రెండో పడవ ఆసామి లడ్డూలు పెట్టాడు ఎక్కినవాళ్ళకు. చివరికోరోజున ప్రయాణికులు జిలేబీ పెడితే ఎక్కుతామన్నారు. అలాగే చేశాడు. నెలరోజులిలా పోటీలు జరిగేటప్పటికి ఇద్దరికీ నిలువు గుడ్లు పడ్డాయి. అక్కడ ఆ సొమ్ము పడవ యజమానులది. ఇక్కడ డబ్బు ప్రజానీకానిది. దీన్ని ఏం త్యాగమంటారు.

మొత్తం మీద ఏది అసలు కాంగ్రెసని తెలియడం లేదింతవరకూ. ప్రజలు ఎవర్ని విశ్వసించారో తెలియడంలేదు. ఎడ్ల జంట ఏది అసలు కాంగ్రెస్సో తేలుస్తుందంటున్నారు. ఎడ్ల గుర్తులమీద ఆధారపడటంలో ఏమంత సొగసుంది? గుర్తుల్ని బర్తరఫ్ చేయించవచ్చు. గుణాల్ని ఫిరాయించగలశక్తి ఎవరికుంది?

ఉభయ కాంగ్రెసు మహాసంస్థలను గిరించిన ఉదంతాలు చాలా ఉన్నాయి. వీలైతే మరోసారి.

Post your comments